సాక్షి
నల్లగొండ
7
ఆదివారం : 24 : డిసెంబర్ : 2023







నల్లగొండలోని వీటీ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

వైకుంఠ వైభవం

వైకుంఠ ఏకాదశి సందర్భంగా నల్లగొండలోని రామగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి హాజరైన భక్తులు...

న్యూస్‌రీల్

మహిళా కమిటీలు వేయాలి

నల్లగొండ : మహిళలపై లైంగిక వేధింపుల చట్టంలో భాగంగా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో పది మంది మహిళలు పనిచేసే చోట నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉందని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో ఒక సీనియర్ మహిళా ఉద్యోగి ప్రెసిడెంట్‌గా, అదే కార్యాలయానికి చెందిన ఇద్దరు మహిళా ఉద్యోగులను, ఒక స్వచ్ఛంద సంస్థ నుంచి సోషల్ వర్కర్‌ను సభ్యులుగా నియమించాలని పేర్కొన్నారు. మహిళలు పనిచేసే సంస్థలో కమిటీలను ఏర్పాటు చేయని యాజమాన్యాలకు రూ.50 వేల జరిమానాతో పాటు సంవత్సరం పాటు జైలు శిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కమిటీలపై ఎలాంటి సందేహాలు ఉన్నా మహిళా సంక్షేమ అధికారిని సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ ప్రాజెక్టుల పరిశీలన



నక్కలగండి కట్ట నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసులు

డిండి, చందంపేట, పెద్దఅడిశర్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వాదేశాల మేరకు జిల్లాలోని పెండింగ్‌లో పలు పెండింగ్ ప్రాజెక్టులను అదనపు కలెక్టర్ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. నక్కలగండి కట్టను, డిండి ఎత్తిపోతల పథకంలో నిర్మించే ప్రాజెక్టుల పనులు, డిండి ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టుల పెండింగ్ పనులు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, డిండి ఆయకట్టు, ముంపునకు గురయ్యే ప్రాంతాల వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీటిపై సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, తహసీల్దార్లు తిర్పతయ్య, రాములు, సంతోష్‌కుమార్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ యుస్తఫా, ఆర్‌ఐలు శ్యామ్, నజీర్, ,ఈఈ యాదన్‌కుమార్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కర్ణాకర్ తదితరులున్నారు.

విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించాలి

నల్లగొండ రూరల్ : అందివచ్చిన అవకాశాలతో విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి కోరారు. శనివారం ఎంజీయూలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రేమ్‌సాగర్, హాస్టల్ డైరెక్టర్‌గా దోమల రమేష్‌ను నియమిస్తూ వీసీ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో ఉంటేనే మంచి గౌరవం లభిస్తుందన్నారు. గతంలో ప్రేమ్‌సాగర్ బయోటెక్ విభాగం అధిపతిగా, హాస్టల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. దోమల రమేష్ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్‌గా, కాంపిటీషన్ సెల్ డైరెక్టర్‌గా పని చేశారు.

నేడు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమావేశం

నల్లగొండ : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం నల్లగొండలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ముల బాబు, జాతీయ కార్యదర్శి అద్దంకి దేవదాసు, రాష్ట్ర అధ్యక్షుడు తొంట సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ హాజరు కానున్నట్లు తెలిపారు.

ప్రజల సమస్యలపై పోరాడుదాం



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందన్నారు. పార్లమెంట్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించిన ఎంపీలను సస్పెండ్ చేయడం అప్రజాస్వామిక చర్య అన్నారు. సమావేశంలో నాయకులు పాలడుగు నాగార్జున, నలపరాజు సైదులు, పోలె సత్యనారాయణ, బొల్లు రవీందర్, ఉప్పుల గోపాల్, కోట్ల అశోక్‌రెడ్డి అంజయ్య, కుర్తాల భూపాల్, వెంకన్న, గోలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

8న 'నీలగిరి' అవిశ్వాసం

- నల్లగొండ మున్సిపాలిటీలో కౌన్సిలర్లకు, ఎక్స్ అఫీషియో సభ్యులకు ఫారం–2 నోటీసులు జారీ
- 30 మంది సంతకాలతో చైర్మన్‌పై అవిశ్వాసానికి నోటీసు ఇచ్చిన కాంగ్రెస్ కౌన్సిలర్లు
- 15 రోజుల సమయం ఇస్తూ తేదీ ఖరారు చేసిన మున్సిపల్ కమిషనర్



సాక్షి ప్రతినిధి నల్లగొండ : నీలగిరి మున్సిపాలిటీ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై అవిశ్వాసం తేదీ ఖరారైంది. వచ్చే నెల 8వ తేదీన అవిశ్వాస సమావేశం నిర్వహిస్తామని పేర్కొంటూ కలెక్టర్.. మున్సిపల్ పాలక వర్గానికి ఫారం–2 నోటీసులను ఈనెల 22వ తేదీతో జారీ చేశారు. 8వ తేదీన ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో అవిశ్వాస సమావేశం నిర్వహించనున్నట్లు అందులో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు 30 మంది సంతకాలతో నోటీసులు ఇచ్చిందని.. మున్సిపల్ కమిషనర్ సహకారంతో కార్యాలయంలో నిర్వహిస్తున్న రికార్డుల ప్రకారం వారందరి సంతకాలు సరైనవేనని నిర్ధారించుకున్నట్లు ఆ ఫారంలో వివరించారు. ఈ అవిశ్వాస సమావేశానికి హాజరుకావాలని మున్సిపాలిటీలోని 48 మంది కౌన్సిలర్లు, ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులకు సమాచారం ఇచ్చారు.

అవిశ్వాసం నెగ్గే అవకాశం..!

మున్సిపల్ చైర్మన్‌పై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే 30 మంది సంతకాలతో అవిశ్వాసం నోటీసు ఇవ్వడం, అవి సరైనవేనని అధికారులు ధ్రువీకరించుకున్నారు. మరోవైపు మూడు రోజుల కిందట మరో కౌన్సిలర్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల సంఖ్య 31కి చేరింది. అలాగే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కౌన్సిల్‌లో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉన్నారు. ఆయనతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో విబేధాలతో బీఆర్‌ఎస్‌నుంచి బయటికి వచ్చిన కౌన్సిలర్ పిల్లి రామరాజు యాదవ్‌తో కాంగ్రెస్ పార్టీ నేతలు సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ ముగ్గురిని కలుపుకుంటే కాంగ్రెస్ కౌన్సిలర్ల బలం 34కు చేరుతుంది. దీనికి తోడు మరికొంత మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు సంప్రదింపులు జరుగుతున్నాయి. దీంతో అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన సంఖ్యాబలం కాంగ్రెస్ పార్టీకి ఉన్నట్లు తెలుస్తోంది. తద్వారా నీలగిరి మున్సిపాలిటీ పీఠాన్ని గులాబీ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకోవడానికి మార్గం సులువు కానుంది.

మొదట్లో తక్కువగానే ఉన్నా..

మొదటి నుంచి మున్సిపాలిటీపై హస్తం పార్టీ ఆధిపత్యమే కొనసాగుతోంది. 2000 సంవత్సరం నుంచి వరుసగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే చైర్మన్‌గా వ్యవహించారు. 2005, 2014 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీనే అత్యధికంగా కౌన్సిలర్లను గెలుచుకొని చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. 2020లో మాత్రం కాంగ్రెస్ 20, బీఆర్‌ఎస్ 20 స్థానాలను గెలుచుకుంది. అప్పుడు బీఆర్‌ఎస్ 20 స్థానాలకే పరిమితమైనా, ఎక్స్ అఫీషియో సభ్యులతో ఓట్లతో చైర్మన్ పదవి దక్కించుకుంది. ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందన్న ధీమాతో కాంగ్రెస్ పార్టీ ఉంది. అది నెగ్గాక ప్రస్తుతం మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డినే చైర్మన్‌ను చేసే అవకాశం ఉంది.

అర్హులందరికీ ఇళ్లు

- ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం
- రాష్ట్ర మంత్రులు పొంగులేటి, ఉత్తమ్
- హుజూర్‌నగర్‌లో పలు శాఖలపై సమీక్ష సమావేశాలు



ఇందిరమ్మ ఇళ్ల కాలనీ మ్యాప్ పరిశీలిస్తున్న మంత్రులు

హుజూర్‌నగర్: అర్హులందరికీ పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో రామస్వామి గుట్ట వద్ద ఆదర్శ నగర్‌లో నిర్మించిన 2,160 ఇందిరమ్మ ఇళ్లను, మ్యాపులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం హుజూర్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలు శాఖలపై సమీక్షించారు.

పక్కా ప్రణాళికతో సాగునీరందిస్తాం..

నీటి పారుదల శాఖ సమీక్ష సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పక్కా ప్రణాళికను రూపొందించి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. ఇందుకు జిల్లాలో ఉన్న అన్ని లిఫ్టులు, చెక్ డ్యాములను పునరుద్ధరిస్తామన్నారు. అధికారులు వాటికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేస్తే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఉత్తమ్ తెలిపారు. రైతులకు ఎక్కడా నష్టం వాటిల్లకుండా అనుబంధ శాఖల అధికారులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. లిఫ్ట్ ఇరిగేషన్‌ల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు సత్వరమే పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నుంచి నిధులను విడుదల చేస్తామని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల ద్వారా రోడ్లకు మరమ్మతులు చేయడంతో పాటు కొత్త రోడ్లను వేస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే 13 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. కానీ, గత ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖనే మరిచిందని మంత్రి విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, మల్లికార్జున ఖర్గేలు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని ఆయన తెలిపారు. అనంతరం మంత్రి ఉత్తమ్ వివిధ శాఖల అధికారులతో నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, ఎ.వెంకట్‌రెడ్డి, నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ రమేష్, హౌసింగ్ చీఫ్ ఇంజనీర్ ఈశ్వరయ్య, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, సీఈఓ సురేష్ కుమార్, డీఆర్డీఓ కిరణ్ కుమార్, డీపీఓ యాదయ్య, సీపీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్లను మూడు నెలల్లో పూర్తి చేస్తాం

హుజూర్‌నగర్ నియోజక వర్గ స్థాయిలో గృహ నిర్మాణాల పురోగతిపై నిర్వహించిన సమీక్షలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం మాటలకే పరిమితమైందన్నారు. 2013లో స్థానికంగా దేవాదాయ శాఖకు సంబంధించిన 109 ఎకరాల భూమికి రెవెన్యూ శాఖ ద్వారా రూ.20 కోట్లు చెల్లించి గృహనిర్మాణ శాఖ ద్వారా కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఆదర్శ కాలనీలో ఇళ్లను నిర్మించారన్నారు. దాదాపు 70 శాతం పనులు పూర్తయినా మిగతావి పూర్తి చేస్తే ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంచి పేరువస్తుందని గత ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. 77 ఎకరాల్లో ఉన్న ఇందిరమ్మ ఆదర్శ కాలనీలో అసంపూర్తి ఇళ్లను మూడు నెలల్లో పూర్తి చేస్తామని, అలాగే 32 ఎకరాలలో ఉన్న ఖాళీ స్థలంలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం తర్వాత ఈ నెల 27న ప్రజలకు తీపి కబురు వినిపిస్తామని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కళల్లో ప్రావీణ్యం పొందాలి



గిరిజన సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న యువతులు

నల్లగొండ టౌన్ : విద్యార్థులు విద్యతో పాటు కళల్లో ప్రావీణ్యత సాధించాలని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. శనివారం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా యువజన ఉత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. స్వామి వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యతో పాటు వివిధ కళారంగాల్లో రాణించాలన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారు జనవరి 6న రాష్ట్రస్థాయిలో జరిగే యువజన ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, గోపాల్‌రెడ్డి, ఆర్.కిరణ్‌కుమార్, రాజేందర్, మేడి హరికృష్ణ, డీవైఎస్‌ఓ మగ్బూల్ అహ్మద్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

ఉద్యోగావకాశాలపై 28న స్పెషల్ డ్రైవ్

నల్లగొండ : వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు, వేతన సమాచారం కోసం ఈ నెల 28న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కార్మిక, ఉపాధి, శిక్షణ కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్) జపాన్, జర్మనీ, యూఏఈ దేశాల్లో నర్సింగ్, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం, నర్సింగ్ అప్రెంటిషిప్, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రిషియన్, ఏసీ టెక్నీషియన్, పెయింటర్, ప్లంబర్, కార్పెంటర్ తదితర రంగాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నట్లు ఆమె తెలిపారు. నర్సింగ్, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం డిప్లొమా హోల్డర్లు, హాస్పిటాలిటీ మేనేజిమెంట్ గ్రాడ్యుయేషన్, ఐటీఐ, టెక్నికల్ కోర్సులు చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు నెలకు రూ.లక్ష నుంచి రూ.1.8 లక్షల వేతనం పొందుతారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జపనీస్, జర్మన్ భాషలపై, వృత్తిపరమైన నైపుణ్యాలపై శిక్షణను హైదరాబాద్‌లో అందిస్తారని పేర్కొన్నారు. వివరాల కోసం 82478 38789, 89190 47600 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సన్న బియ్యం అంతా మాయ

- పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాలకు రీసైక్లింగ్ బియ్యం ఇస్తున్నారు
- ఆ బియ్యంతో వండిన అన్నం పిల్లలు తినలేకపోతున్నారు
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, పలువురు జెడ్పీటీసీల ఆవేదన
- రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలపై వాడీవేడి చర్చ



జెడ్పీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు


నల్లగొండ : సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలలకు రీ సైక్లింగ్ చేసిన బియ్యాన్ని సరఫరా చేస్తూ.. సన్న బియ్యం అంటూ మాయ చేస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. పలు సమస్యలపై వాడీవేడిగా చర్చ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డితోపాటు పలువురు సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలు, హాస్టళ్లకు ఇచ్చే బియ్యంలో నాణ్యత ఉండడం లేదని.. ఆ బియ్యం వండితే మెత్తగా అయి పిల్లలు తినలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కిలో బియ్యానికి రూ.38 చెల్లిస్తుందని.. ఆ మొత్తంతో బీపీటీ బియ్యం ఇవ్వాల్సి ఉన్నా.. రేషన్ బియ్యాన్ని రిసైక్లింగ్ చేసి ఇస్తున్నా.. వాటి నాణ్యతపై అధికారులకు పట్టింపు లేకుండా పోయిందన్నారు. దీనిపై పౌరసరఫరాల డీఎం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా బియ్యాన్ని పరీక్ష చేసి ఇస్తామని చెప్పారు. ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ ఇప్పటి నుంచి బియ్యాన్ని పరిశీలించి రీ సైక్లింగ్ అని తేలితే 6ఏ కింద కేసులు నమోదు చేస్తామన్నారు.


స్తంభాలు అమ్ముకుంటున్నారు..


పెద్దవూర జెడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలో 200 విద్యుత్ స్తంభాలు వేసి కొన్ని స్తంభాలకు మాత్రమే తీగలు లాగారని మిగతా వాటిని వదిలేయడం వల్ల ఆ స్తంభాలను వెంచర్లకు అమ్ముకుంటున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. కట్టంగూర్ జెడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామాలకు ఒక్కటే బ్రేకర్ ఉండటం వల్ల ఏ గ్రామంలో కరెంట్ పోయినా సబ్‌స్టేషన్‌లో బ్రేకర్‌ను ఆఫ్ చేయాల్సి వస్తోందని.. దీని వల్ల 15 గ్రామాలకు కరెంట్ పోతోందని చెప్పారు. ఈ సమస్య పరిష్కరించాలని రెండేళ్లుగా చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మునుగోడులో ఒక పాఠశాల సీబీఎస్‌ఈ అనుమతి లేకున్నా నడుతున్నారని.. ఆ పాఠశాల విద్యుత్ చౌర్యానికి కూడా పాల్పడుతోందన్నారు. స్పందించిన ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్ విజిలెన్స్ అధికారులను పంపించామని ఆధారాలు దొరకలేదన్నారు. మళ్లీ విజిలెన్స్ అధికారులను పంపించాలని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, పక్కన ఇన్‌చార్జి కలెక్టర్







మాట్లాడుతున్న ఎంఎల్‌సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, వీరేశం

పనుల్లో నిర్లక్ష్యం వీడాలి..

పంచాయతీరాజ్ రోడ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, పనులు సక్రమంగా చేయకున్నా రికార్డు చేసి బిల్లులు చెల్లిస్తున్నారని నాంపల్లి జెడ్పీటీసీ ఆరోపించారు. చాలా పాఠశాలలకు తన నిధుల నుంచి డబ్బులు ఇచ్చామని టెండర్లు పిలిచి పనుల్లో చేపట్టడంలో జాప్యం చోటు చేసుకుంటోందన్నారు. ప్రొటోకాల్ విషయంలో తన పేరు పెట్టడం లేదని.. చండూరు జెడ్పీటీసీ సభ్యుడు సభ దృష్టికి తీసుకురాగా మరోసారి అలాంటివి జరగకుండా చూసుకుంటామని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అన్నారు. కొత్త పంచాయతీల్లో రేషన్‌షాపులు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రజలు పాత పంచాయతీల నుంచి బియ్యం తెచ్చుకుంటున్నారని వెంటనే రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని పలువురు సభ్యులు కోరారు. పలువురు ఉపాధ్యాయులు డిప్యుటేషన్ ఇచ్చిన ప్రాంతానికి వెళ్లడం లేదని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు పట్టణాలకే పరిమితమయ్యాయని.. గ్రామీణ ప్రాంతాలకు సక్రమంగా రావడం లేదన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి..

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ తాటికల్, కడపర్తి రోడ్లు దెబ్బతిన్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ పదేళ్ల కాలంలో విద్యా వ్యవస్థ ఆందోళనకరంగా మారిందన్నారు. టీచర్ పోస్టులను భర్తీ చేయలేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. సింగిల్ టీచర్ పాఠశాలలను తొలగించడం వల్ల కిలోమీటర్ల దూరం నడిచి చదువుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. తమ ప్రభుత్వం విద్యా వ్యవస్థ, పెన్షన్లు తదితర సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేపడుతోందన్నారు.

నూతన ఎమ్మెల్యేలకు సన్మానం..

కొత్తగా విజయం సాధించి జిల్లా పరిషత్ సమావేశానికి హాజరైన దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలతో పాటు ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర శాఖలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిట్టీల వ్యాపారిపై కేసు

కోదాడరూరల్: చిట్టీల వ్యాపారిపై శనివారం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కోదాడ పట్టణానికి చెందిన బిక్కుమళ్ల నాగహనుమంతరావు 25 ఏళ్లుగా చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. ఈ వ్యాపారం పేరుతో పదుల సంఖ్యలో చిట్టీదారులందరిని నమ్మించి సుమారు .5కోట్ల మేర ఎగవేసి పరారయ్యాడని పట్టణానికి చెందిన ఉప్పలవంచ కష్ణమూర్తి ఫిర్యాదు మేరకు సీఐ రాము కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తురాలి కాలికి గాయం

యాదగిరిగుట్ట: వైకుంఠ ఏకాదశి వేడుకల్లో భాగంగా ఉత్తర ద్వార దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలు జారి పడటంతో కాలికి గాయమైంది. నల్లగొండ జిల్లా అనుముల మండలానికి చెందిన వీరమ్మ శనివారం ఉత్తర ద్వార దర్శనానికి వచ్చారు. భక్తులు అధికంగా శ్రీస్వామిని దర్శించుకునేందుకు రావడంతో మాఢవీధిలో జారిపడింది. వెంటనే కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది గుర్తించి ఆమెను కొండ కింద ఆస్పత్రికి తరలించారు.



భక్తురాలిని వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్న సిబ్బంది

విద్యుదాఘాతంతో రైతు మృతి

మఠంపల్లి: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. మఠంపల్లి మండలం జామ్లాతండాకు చెందిన భూక్యా కృష్ణ(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం పొలంలో వరినాట్లు వేయిస్తున్నారు. ఈ సమయంలో మోటార్ పనిచేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

మఠంపల్లి : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మఠంపల్లి మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. అనంతగిరి మండలం రంగయ్యగూడేనికి చెందిన షేక్.సైదులు(45) అతని భార్య హుస్సేన్‌బీ మఠంపల్లి నుంచి బైక్‌పై హుజూర్‌నగర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో చిలుకూరు మండలకేంద్రానికి చెందిన కాంపాటి గురవయ్య ఎదురుగా కారు వస్తూ వీరి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించగా సైదులు మృతిచెందాడు. హుస్సేన్‌బీ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుంది. మృతుని సోదరుడు షేక్.బడేసాబ్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

యాదాద్రిలో వైకుంఠ వైభవం



గరుడ వాహనంపై వైకుంఠనాథుడిని దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

- ఉత్తర ద్వారంలో వైకుంఠనాథుడిగా భక్తులకు దర్శనమిచ్చిన నృసింహుడు
- యాదగిరికొండపై మార్మోగిన నారసింహ నామస్మరణ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహుడు శనివారం భక్తులకు వైకుంఠనాథుడిగా దర్శనమిచ్చారు. యాదాద్రీశుడి ప్రధానాలయ ఉత్తర ద్వారం గుండా భక్త జనులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 6.30గంటలకు గరుడ వాహనంపై వైకుంఠ నాథుడిగా శ్రీనరసింహస్వామిని అలంకారం గావించి, అమ్మవారిని, ఆళ్వారాదులను అలంకార సేవలతో ప్రధానాలయం నుంచి ఉత్తర ద్వారం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పంచారాత్రా ఆగమ శాస్త్ర ప్రకారం పూజలు నిర్వహించారు. ఉదయం 6.42గంటలకు అమృత ఘడియల్లో నారసింహుడు ఉత్తర ద్వారం వద్ద వైకుంఠనాథుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఉదయం 3గంటలకు ఆలయాన్ని తెరిచి సుప్రభాతం, ప్రాతఃకాల తిరువారధన, ధనుర్మాస తిరుప్పావై సేవా కాలం, బాలభోగం, ఆరగింపు, చాత్మురై వంటి పూజలు జరిపించారు. 5.30గంటల నుంచి 6.30గంటల వరకు స్వామివారిని గరుడవాహనంపై ప్రత్యేక సేవలో ఊరేగిస్తూ 6.42గంటలకు ఉత్తర ద్వారం గుండా ద్వార దర్శనం కల్పించారు. ఈ సమయంలో మంగళవాయిద్యాలు, ఆచార్యుల వేదమంత్రాలతో యాదాద్రి కొండ అంతా మార్మోగిపోయింది. భక్తులు యాదాద్రీశా.. జై లక్ష్మీ నారసింహ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

పాతగుట్టలో...

యాదాద్రి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వారంలో నృసింహుడు వైకుంఠనాథుడిగా దర్శనమించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వామి అమ్మవార్లకు సుప్రభాతం, ఆరాధన చేపట్టారు. వైకుంఠనాథుడిగా స్వామివారిని అలంకరించి గరుడ వాహనంపై ప్రత్యేక సేవలో ఉత్తర ద్వారం వద్దకు తీసుకువచ్చారు. ఉదయం 6.42 గంటలకు భక్తులకు శ్రీస్వామివారు వైకుంఠనాథుడిగా దర్శనమిచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు క్యూలైన్ ద్వారా ముఖ మండపంలో స్వామివారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు.



వైకుంఠనాథుడి సేవలో చేనేతజౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దంపతులు

యాదాద్రిలో ప్రముఖుల పూజలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంత్ కె. జెండగే, డీఐజీ సత్యనారాయణ, అదనపు జిల్లా జడ్జి మారుతీదేవి, సబ్ జడ్జి దశరథరామయ్య వేర్వేరుగా దర్శించుకున్నారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకున్నారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. స్వామిని దర్శించుకున్న వీరికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.



స్వామివారి సన్నిధిలో చేనేతజౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు



శ్రీస్వామి వారి సేవకు ముందు పాశురాలు పఠిస్తున్న ఆచార్యులు, రుత్వికులు

అధ్యయనోత్సవాలకు శ్రీకారం

- ఆరు రోజుల పాటు అలంకార సేవలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయాధికారులు అధ్యయనోత్సవాలకు శ్రీకారం చుట్టారు. వైకుంఠ ద్వార దర్శనం పూర్తయిన తర్వాత ఆచార్యులు ద్రావిడ ప్రబంధ సేవాకాలం పారాయణిక స్వాములచే ఆరురోజుల అధ్యయనోత్సవాలను ప్రారంభించారు. తొలుత తొళక్కముతో అధ్యయనోత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో శ్రీస్వామివారిని విష్ణుమూర్తిగా అలంకారం చేసి మత్స్యావతార సేవలో పురప్పాట్ సేవగా ఊరేగించారు.



మత్స్యావతార సేవలో తిరువీధిలో ఊరేగుతున్న స్వామివారు చిత్రంలో ఈఓ రామకృష్ణారావు, కలెక్టర్ హనుమంతు కె. జెండగే, ఆచార్యులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

వైకుంఠ ఏకాదశి, అధ్యయనోత్సవాల్లో భాగంగా యాదాద్రి ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. దేవులపల్లి శ్రీదేవి ఆధ్వర్యంలో భక్తి సంగీతం, సంగీత సిస్టర్స్‌చే భక్తి సంగీతం నిర్వహించారు.

తెలంగాణ చెస్ జట్టు కోచ్‌గా కరుణాకర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్, చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గెజిటెడ్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న కోసనం కరుణాకర్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర చెస్ జట్టు కోచ్‌గా ఎంపికయ్యారు. ఈ నెల 25 నుంచి 30 తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరులో జరిగే 67వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చెస్ క్రీడా పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టు చెస్ కోచ్‌గా వ్యవహరించనున్నట్లు కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాగా జిల్లాకు చెందిన దివ్య భవాని అండర్–19 విభాగంలో, రమ్య అండర్–14 విభాగంలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకుగాను ఎంపికయినట్లు ఆయన పేర్కొన్నారు.



కోసనం కరుణాకర్‌రెడ్డి, రాష్ట్ర చెస్ కోచ్.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

డిండి: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందాడు. నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హన్మకొండ జిల్లా ఆత్మకూర్ మండలం అగ్రహంపహాడ్ గ్రామానికి చెందిన మాదార్సి చరణ్(21) మరో ఐదుగురు వ్యక్తులతో కలిసి వండర్ టీంగా ఏర్పడి మ్యాజిక్ షో నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో శనివారం డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం స్థానిక ఈజే గార్డెన్‌లో మ్యాజిక్ షో నిర్వహించారు. షో ముగిసిన తర్వాత క్లాత్ కర్టన్‌లకు కట్టిన వైర్లను తొలగిస్తున్న క్రమంలో చరణ్ విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. గమనించిన మిత్రులు అతడిని నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.



చరణ్ (ఫైల్)

మట్టపల్లిలో ముక్కోటి ఏకాదశి వేడుకలు

- ఉత్తర ద్వార దర్శనమిచ్చిన శ్రీలక్ష్మీనరసింహుడు
- గరుడవాహనంపై ఊరేగిన స్వామివారు
- తరలివచ్చిన రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు



మట్టపల్లిలో స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేతంగా తెల్లవారుజామునే భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం గావించారు. ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, మంత్రపుష్పనీరాజనాలతో వైకుంఠద్వార దర్శనం గావించారు. బ్రహ్మశ్రీ సోమయాజుల లక్ష్మీనరసింహశాస్త్రి, యడవెల్లి సత్యనారాయణశర్మలచే వైకుంఠ ఏకాదశి మహత్యం నిర్వహించారు. అనంతరం విజయవాడకు చెందిన అగ్నిహోత్రం శ్రీవైష్ణవిచే అన్నమాచార్య సంకీర్తనలు, ఏపీలోని తాడేపల్లిగూడెంకు చెందిన టీవీ.కళాకారులు కె.శారదా భాగవతారణిచే ధ్రువచరిత్ర హరికథ నిర్వహించారు. గరుడవాహనంపై శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేతంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి గ్రామోత్సవం గావించారు. అనంతరం శ్రీస్వామివారి ఆలయప్రవేశం చేయించారు. అనంతరం వేలాదిమంది భక్తులకు అన్నదానాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్తలు పాలకమండలి సభ్యులు ప్రారంభించారు. అనంతరం వివిధ కళామండలి సభ్యులచే నిర్వహించిన భక్తి సంగీతం ఆకట్టుకుంది.

వివిధ కులాల సత్రాలలో అన్నదానం

మట్టపల్లిలో రెండురోజులపాటు జరిగిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు అధికసంఖ్యలో తరలివచ్చిన రెండుతెలుగు రాష్ట్రాల భక్తులకు బ్రాహ్మణ, ఆర్యవైశ్య, రెడ్డి, కమ్మ, గౌడ, పద్మశాలి, ముదిరాజ్, యాదవ, నాయిబ్రాహ్మణ, దళిత గిరిజన అన్నదాన సత్రాలు విరివిగా అన్నదానాలు విశేషంగా గావించాయి. మఠంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, సాముల శివారెడ్డి, జడ్పీటీసీ జగన్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, మాజీ ఎంపీపీలు కె.లక్ష్మీవెంకటనారాయణ, ఎం.కొండానాయక్, సర్పంచ్ విజయలక్ష్మివెంకటరమణ, గుండా కొండల్‌రెడ్డి, కామేశ్వరమ్మ, కోటిరెడ్డి, శౌరిరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో గరుడవాహనంపై ఊరేగుతున్న నృసింహస్వామి

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

చివ్వెంల(సూర్యాపేట) : ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతిచెందాడు. చివ్వెంల మండలం తుల్జారావుపేట గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలంను ట్రాక్టర్‌తో దున్నుతుండగా దిగబడింది. దీంతో ఆ రైతు పెన్‌పహాడ్ మండలం ధర్యాపురం ఆవాసం గంగ్లి తండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మాలోతు కురువా(30) సహాయం కోరాడు. ఆ వాహనాన్ని బయటకు తీసేక్రమంలో కురువా ట్రాక్టర్‌పైకి ఎక్కి తీస్తుండగా ప్రమాదవశాత్తు వీల్స్‌పైకి లేవడంతో వెనుకకు తిరగబడింది. దీంతో డ్రైవర్ దానికింద ఇరుక్కుపోయి మృతిచెందాడు. సమీప రైతులంతా కలిసి జేసీబీ సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



మాలోతు కురువా మృతదేహం

భువనగిరిలో రెండు దుకాణాల్లో చోరీ

భువనగిరి క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు భువనగిరి పట్టణంలోని రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. దుండగులు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జిల్లా కేంద్రం ప్రధాన రహదారి వెంట మీనానగర్ సమీపంలో ఉన్న ఓ వస్త్ర దుకాణం తాళాలు పగులగొట్టి రూ.30వేలు అపహరించారు. అదే విధంగా ఆ పక్కనే ఉన్న బాలాజీ ఎలక్ట్రికల్ అండ్ సానిటరీ దుకాణంలో ఇదే తరహాలో రూ.45వేలు ఎత్తుకెళ్లారు. చోరీ దశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి. శనివారం ఉదయం దుకాణాల యజమానులు చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధ్యులు రాజీనామా చేయాలి

చిట్యాల: పార్లమెంటులో సభ్యులపై దాడి చేసేందుకు ప్రయత్నించిన ఘటనకు బాధ్యత వహిస్తూ దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి రాజీనామా చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. చిట్యాలలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడి ఘటనకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. జరిగిన సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య, జల్లెల పెంటయ్య, మండల నాయకులు బొబ్బలి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలుగువారి ఖ్యాతిని పెంచిన పీవీ

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



పీవీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : తెలుగువారి ఖ్యాతిని ప్రపంచ స్థాయికి పెంచిన మహోన్నతుడు.. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కనగల్ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు ఐతగోని స్వామిగౌడ్, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, హరికృష్ణ, మాజీ ఎంపీపీ దైద రజితరెడ్డి, రామలచ్చయ్య, మునాస వెంకన్న, చిలకరాజు శ్రీనివాస్, కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఆటో బోల్తా... ఏడుగురికి గాయాలు

సూర్యాపేట రూరల్ : ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట పట్టణ పరిధిలోని గాంధీనగర్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని దాస్‌తండా గ్రామానికి చెందిన శ్రీదేవి, అచ్చమ్మ, కృష్ణ, సునీత, కవిత ఆటోలో సూర్యాపేట నుంచి దాస్‌తండాకు వెళ్తున్నారు. మార్గ మధ్యలో గాంధీనగర్ సమీపంలో జనగాం రోడ్డులో ఒక్కసారిగా కోతి అడ్డు రావడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణ, అచ్చమ్మ, శ్రీదేవితో పాటు మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మడిలో దిగి.. నారు కట్టలు పంచి..

వ్యవసాయ పనుల్లో తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ బిజీబిజీ





తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం వ్యవసాయ పనుల్లో తలమునకలయ్యారు. తన స్వగ్రామం అడ్డగూడూరు మండలంధర్మారం గ్రామంలో కౌలుకు తీసుకున్న 18ఎకరాల్లో వరినాట్ల పనులు కూలీలతో కలిసి పూర్తి చేయించారు. ఎమ్మెల్యే స్వయంగా పొలం మడిలోకి దిగి కూలీలకు నారుకట్టలు అందించారు. మొత్తంగా 27 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నానని మరో 9 ఎకరాల్లో నాట్లు వేయించాల్సి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. – అడ్డగూడూరు